రోడ్డు వెడల్పు చేయాలని వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న లచ్చిబాబు

దుండిగల్‌: వీఎస్‌ఆర్‌ విజ్ఞాన్‌ జ్యోతి కళాశాల నుంచి భౌరంపేటలోని బొడ్రాయి వరకు ఉన్న రోడ్డును 100 ఫీట్ల మేర వెడల్పు చేయాలని ప్రణీత్‌ ప్రణవ్‌ బ్లూమ్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కోలా లచ్చిబాబు కోరారు. ఈ మేరకు బుధవారం పంచాయతీ రాజ్‌ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం 30 ఫీట్లు ఉన్న రోడ్డు కారణంగా నిత్యం ట్రాఫిక్‌ రద్దీ ఏర్పడుతుందని, 100 ఫీట్ల రోడ్డు వెడల్పు పనులను చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య వర్ధంతి

జగద్గిరిగుట్ట: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్‌ అన్నారు. బుధవారం వర్ధంతి సందర్భంగా జగద్గిరిగుట్టలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆల్‌ ఇండియా దళిత సేన జాతీయ అధ్యక్షులు డాక్టర్‌ అవి, జై జేమ్స్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి వై బాలరాజు, ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షులు జనార్దన్‌, మాజీ కౌన్సిలర్‌ గూడ వరమ్మ, కళమ్మ సత్యలక్ష్మి, లక్ష్మి, సులోచన, యాదగిరి, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

– మరో ముగ్గురు పరారీ

కుత్బుల్లాపూర్‌: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తి పట్టుబడగా.. మరో ముగ్గురు పరారైన ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అపెరల్‌ పార్కు వద్ద మంగళవారం గంజాయి విక్రయాలు చేపడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో దాడులు నిర్వహించారు. ఒకరిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తిని కరీంనగర్‌ జిల్లా సదాశివపల్లికి చెందిన భువనేశ్వర్‌(22)గా గుర్తించారు. అతని వద్ద 1.444 గ్రాముల డ్రై గంజాయిని, టీఎస్‌ 25 జీ 4170 బైక్‌, ఫోన్‌ను సీజ్‌ చేసి కేసు నమోదు చేశారు. టింకూ, వెంకటేష్‌ , అఖిల్‌, మహ్మద్‌ ఆఫ్రీద్‌ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కష్టపడితే సాధించలేనిది ఏమీ లేదు



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఎల్‌ఏపీఆర్‌ఓ నారాయణరావు తదితరులు

సుభాష్‌నగర్‌: కష్టపడి చదివితే సాధించలేనిది ఏమీ లేదని ఎంఎల్‌ఏపీఆర్‌ఓ నారాయణరావు అన్నారు. 2024–25 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బహదూర్‌పల్లిలోని కేఎం పాండు మెమోరియల్‌ ప్రభుత్వ ఒకేషనల్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. పవన్‌ పుత్ర ఎంటర్‌ప్రైజెస్‌ మేనేజ్‌మెంట్‌ డైరెక్టర్‌ ఏవీ రావుతో కలిసి ప్రోత్సాహక నగదును అందజేసి అభినందించారు. ఒకేషనల్‌ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలున్నాయని, జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలంటే కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ షేక్‌ మెహమూద్‌ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మున్సిపల్‌ కమిషనర్‌ సమీక్ష

నిజాంపేట్‌ : నిజాంపేట్‌ నగర పాలక సంస్థలోని వివిధ శాఖాధిపతులు, వార్డు ఆఫీసర్లతో బుధవారం మున్సిపల్‌ కమిషనర్‌ సాబేర్‌ అలీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌ కార్డులు, రాజీవ్‌ యువ వికాసం, ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులకు కేటాయించబడిన టార్గెట్‌ మేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపించేందుకు వేగవంతంగా విచారణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీ జోత్స్నాదేవి, డీఈ వంసత, యునెస్‌, మేనేజర్‌ పవన్‌ కుమార్‌, రెవెన్యూ అధికారి రమేష్‌, జయరాజు, ప్రియాంక, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

లిఫ్ట్‌గుంతలో పడి వృద్ధురాలి మృతి

జీడిమెట్ల: ప్రమాదవశాత్తు ఓ వృద్ధురాలు లిఫ్ట్‌ గుంతలో పడి మృతి చెందింది. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ మల్లేష్‌ వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన ఒడ్నాల రాజేశ్వరి(69)మూడు రోజుల క్రితం కూతురిని చూసేందుకు కుత్బుల్లాపూర్‌లోని మోదీ సిల్వర్‌స్ప్రింగ్‌ అపార్ట్‌మెంట్‌కు వచ్చింది. బుధవారం ఉదయం రాజేశ్వరి లిఫ్ట్‌లో కిందికి వెళ్లేందుకు ఒకటవ ఫ్లోర్‌లోని లిఫ్ట్‌ వద్ద నిల్చుంది. లిఫ్ట్‌రాకముందే ఆమె లిఫ్ట్‌ వచ్చిందనుకుని తలుపులు తీసి ప్రమాదవశాత్తు గుంతలో పడింది. ఆమె పైకి లిఫ్ట్‌ రావడంతో సదరు వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులెవరో?

రాజీవ్‌ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

- వడపోతపై ప్రత్యేక దృష్టి
- మండల స్థాయిలో కమిటీ కన్వీనర్‌గా ఎంపీడీఓ
- జంట సర్కిళ్ల పరిధిలో 10,680 దరఖాస్తులు



కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ కార్యాలయంలో దరఖాస్తులను విభజిస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో రాజీవ్‌ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తుల వడపోత కార్యక్రమం మొదలైంది. కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అర్హుల జాబితాను రూపొందించేందుకు సంబంధిత శాఖల అధికారులతో మండల, పట్టణ, జిల్లా స్థాయి కమిటీలను కలెక్టర్‌ గౌతమ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముందుగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను కార్పొరేషన్ల వారీగా విభజించి, అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నారు.

అర్హుల ఎంపికకు ప్రత్యేక అధికారులు

రాజీవ్‌ యువ వికాసం పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను కుత్బుల్లాపూర్‌, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న మహిళా గ్రూపు సంఘాల ప్రతినిధులతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల వారీగా విభజించి అధికారులకు ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ ఆదేశాలతో ఆయా విభాగాల వారీగా ఉన్న అధికారులను పంపించి ఈ ప్రక్రియ వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మండల, పట్టణ స్థాయి కమిటీలకు కన్వీనర్‌గా పురపాలక కమిషనర్‌/ఎంపీడీఓ, మండల ప్రత్యేక అధికారి, సంబంధిత కార్పొరేషన్లకు చెందిన అధికారి, బ్యాంక్‌ మేనేజర్‌, డీఆర్డీఏ నుంచి ఒకరిని సభ్యులుగా నియమించారు. ఐదు సంవత్సరాలుగా ఏమైనా రుణాలు తీసుకున్నారా?, ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా?, వారి ఆర్థిక స్థితిని పరిశీలించిన తర్వాత మండల కమిటీకి నివేదిస్తారు. అక్కడి నుంచి జిల్లా కమిటీకి జాబితాను పంపించిన తర్వాత లబ్ధిదారుడు ఎంచుకున్న యూనిట్‌ లను అనుసరించి రూ.50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాలు అందించనున్నారు.

8 కేంద్రాల్లో 10,680 దరఖాస్తులు

జంట సర్కిళ్ల పరిధిలో ఎనిమిది కేంద్రాల్లో ఏప్రిల్‌ 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌తో పాటు నేరుగా దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి జాబితా రూపొందించారు. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలో 6,989 దరఖాస్తులు, గాజులరామారం సర్కిల్‌లో 3,691 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం10,680 దరఖాస్తులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీల వారీగా విభజించి అర్హులను ఎంపిక చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ దరఖాస్తుల్లో లబ్ధిదారులు ఎంతమంది అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత జాబితా జిల్లా కలెక్టర్‌ ఆధ్వర్యంలో విడుదల చేస్తామని ప్రత్యేక అధికారులు తెలిపారు.

లీకేజీ.. మరమ్మతులేవి?



పైప్‌లైన్‌ వద్ద లీకవుతున్న దృశ్యం

రోడ్డుపై పారుతున్న తాగునీరు

చింతల్‌, పాపయ్య యాదవ్‌ నగర్‌ ప్రధాన రహదారిలో నెల రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ దారిలో పైపులైన్‌ లీకేజీతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులుల స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

–జగద్గిరిగుట్ట

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

– ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌ అయోధ్య నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో 'గ్రేస్‌ కేన్సర్‌ ఫౌండేషన్‌, బైబిల్‌ ఫౌండేషన్‌' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్‌ వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి శిబిరాలను మరిన్ని ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో బైబిల్‌ మిషన్‌ పాస్టర్‌ చిట్టి బాబు, మేడ్చల్‌ జిల్లా ఫిషరీస్‌ కో ఆపరేటివ్‌ చైర్మన్‌ మన్నె రాజు, జీహెచ్‌ఎంసీ డివిజన్‌ అధ్యక్షులు రుద్ర అశోక్‌, పుప్పాల భాస్కర్‌, పోలే శ్రీకాంత్‌, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్‌ వేణు యాదవ్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు కుంట సిద్దిరాములు, సుధాకర్‌ గౌడ్‌, నరేందర్‌ రెడ్డి, సమ్మయ్య నేత, జ్ఞానేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.శైలజ

దుండిగల్‌: మట్టి భౌతిక స్థితి తెలుసుకునే ముందు రైతులు పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించాలని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్‌ కె.శైలజ అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా బుధవారం దుండిగల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయంలో సాంకేతిక, ఆధునిక పద్ధతులను పాటించాలన్నారు. పొలంలో సాగు చేసే ముందు మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తే పొలం సాంద్రత తెలుస్తుందన్నారు. వరిలో యాంత్రీకరణ పద్ధతైన డ్రమ్‌ సీడర్‌ విధానంతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాల విధులను వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్‌.యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్‌ సభ్యుడు శ్రీనివాసులు, వీఆర్‌ఏ రాజు, ప్రగతిశీల రైతులు సదానందరెడ్డి, సీహెచ్‌ అశోక్‌, రాజ్‌కుమార్‌, పాండురంగ నాథ్‌, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు.. భయపెట్టేటట్టు!



ఎండిన చెట్టును తొలగించకపోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ చౌరస్తా నుంచి చింతల్‌కు వెళ్లే రహదారిలో పెట్రోల్‌ బంక్‌ సమీపంలో రోడ్డుపై ఓ వృక్షం ఎండిపోయింది. ఇటీవల గాలులతో వర్షాలు కురుస్తున్న క్రమంలో ఆ వృక్షం ఎప్పుడు ఎవరిపై పడుతుందోనని వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రమాదం జరుగకముందే సంబంధిత అధికారులు వెంటనే వృక్షాన్ని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు

–రంగారెడ్డినగర్‌

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్‌: కార్మిక వ్యతిరేక నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్‌ కోరారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె నోటీసులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కూటమి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్‌ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ దేశంలో ఉన్న మెజార్టీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మెకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. యాజమాన్యాలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పసుల అంజయ్య, మండల నాయకులు కృష్ణ, సంతోష్‌, రాములు తదితరులు పాల్గొన్నారు.



నోటీసు అందజేస్తున్న నాయకులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నిజాంపేట్‌ : దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్‌ అన్నారు. బుధవారం బాచుపల్లి ఇండస్ట్రియల్‌ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో బాచుపల్లి, ఆలీఫ్‌ ఇండస్ట్రీయల్‌ ప్రాంతాల్లో 20న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్‌ కోడ్స్‌ అమలు చేయకుండా, కార్మికుల హక్కులను పరిరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో మాణిక్యం, ప్రవీణ్‌, యాదయ్య, ఆంజనేయులు, పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న నాయకులు

నిజాంపేట్‌ : ప్రగతినగర్‌లో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం పలువురు నాయకులు ఘన నివాళులు అర్పించారు. వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఘనంగా సీతారామరాజుకు ఘన నివాళి అర్పించారు. రవి అస్తమించని బ్రిటీష్‌ సామ్రాజ్యాన్ని గిరిజన సైన్యంతో గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ, తెలుగు జాతి గర్వించదగ్గ స్వాతంత్ర్య సమరవీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఎమ్‌ఆర్‌ఎస్‌ రాజు, నరేంద్ర చౌదరి, ప్రసాద్‌రాజు, బిక్షపతియాదవ్‌, దాసి నాగరాజు, చంద్రమౌళి, సుమన్‌రావు, వెంకటపతిరాజు, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

రంగారెడ్డినగర్‌: రంగారెడ్డినగర్‌ డివిజన్‌ గిరినగర్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరపూజ, నవగ్రహ పూజ, ఉదయం 11.30 గంటలకు బ్రహ్మయజ్ఞం, మధ్యాహ్నం 1.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

సుభాష్‌నగర్‌: కుత్బుల్లాపూర్‌ ప్రభుత్వ డిగ్రీ పాఠశాలలో దోస్త్‌–2025 అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ అలివేలు మంగమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌ పాసైన అభ్యర్థులు ఈ నెల 21లోగా నమోదు చేసుకోవాలని, తమ కళాశాలలో బీఏ, బీకామ్‌, బీఎస్సీ కాంబినేషన్లలో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని, ఇతర వివరాలకు వైస్‌ ప్రిన్సిపాల్‌ శ్రీధర్‌ (9440375698), రంజిత్‌ (7984411892) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆపరేషన్‌ అభ్యాస్‌

యుద్ధం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



సుచిత్ర చౌరస్తాలో మాక్‌డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న డీసీపీ కోటిరెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్‌: పహల్గాం ఉగ్రదాడితో దేశంలో హైఅలర్ట్‌ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు. ఉగ్రదాడి జరిగితే ఎలా ఎదుర్కోవాలని, క్షతగాత్రులకు ఎలా తక్షణ సహాయక చర్యలు అందించాలన్న విషయంపై అవగాహన కల్పించారు. దుండిగల్‌, పేట్‌బషీరాబాద్‌, సూరారం, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మాక్‌డ్రిల్‌ జరిగింది. సుచిత్ర చౌరస్తాలో పేట్‌బషీరాబాద్‌ సీఐ విజయవర్ధన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను మేడ్చల్‌ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ రాములు పర్యవేక్షించారు. సూరారం చౌరస్తాలో సూరారం పోలీసులు మాక్‌డ్రిల్‌ నిర్వహించారు.



సూరారం చౌరస్తాలో మాక్‌డ్రిల్‌ నిర్వహిస్తున్న సూరారం పోలీసులు

కార్మికులకు వెల్ఫేర్‌ కార్డులు అందజేయాలి

కూకట్‌పల్లి: భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్‌ కార్డులను అందజేయాలని టీపీసీసీ లేబర్‌సెల్‌ జిల్లా అధ్యక్షులు కందాడి సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ప్రతి నియోజకవర్గంలో కార్మిక శాఖ ద్వారా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కార్మికులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో సప్పిడి భాస్కర్‌, కర్కల ఉపేందర్‌ రెడ్డి, కావలి గోపాల్‌, సంపత్‌ కుమార్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్‌ సిందూర్‌తో ఉగ్రవాదులకు గుణపాఠం



అల్విన్‌ కాలనీలో టపాసులు కాలుస్తున్న కార్పొరేటర్‌ వెంకటేష్‌ గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఆర్మీ నిర్వహించిన ఆపరేషన్‌ సిందూర్‌ విజయవంతంగా ప్రారంభం కావడంతో ప్రజలు సంబురాలు నిర్వహించారు. పాక్‌ ఆక్రమిత కాశ్మీర్‌తో పాటు పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై మెరుపు దాడులు చేసి ధ్వంసం చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండ గుడ్‌విల్‌ హోటల్‌ వద్ద కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్‌ నాయకులతో బుధవారం సంబురాలు నిర్వహించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం జరిగిందన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

చింతల్‌: చింతల్‌ డివిజన్‌ భగత్‌సింగ్‌ నగర్‌లోని శ్రీ ధర్మశాస్త సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు గణపతి పూజ, పంచగవ్యం, రుత్విక్‌ వర్ణ, దీక్ష దారుణ, అఖండదీపారాధన తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రతిష్ఠ విగ్రహాలను ఊరేగించారు, సాయంత్రం 6:30 గంటలకు జలదివాసం క్షీరాదివాసం, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉగ్రవాదులకు తగిన గుణపాఠం

- పీవోకేపై దాడులపై స్పందన

కుత్బుల్లాపూర్‌: భారత సైన్యం ఆపరేషన్‌ సిందూర్‌ పేరిట ఉగ్రవాద శిబిరాలపై దాడి చేయడం పట్ల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రవాద కేంద్రాలతో పాటు ఉగ్రవాదులే లక్ష్యంగా భారత సైన్యం చేసిన క్షిపణి దాడి అభినందనీయమన్నారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం తప్పదన్నారు. భారత సైన్యంపై ప్రజలందరికి నమ్మకముందని, వారికి మనం అండగా ఉండాలని అన్నారు.

నిజమైన నివాళి



ఉగ్రదాడికి మన సైనికులు దీటైన జవాబు ఇచ్చారు. ఉగ్రవాద క్యాంప్‌లను గురి చూసి ధ్వంసం చేయడం సంతోషంగా ఉంది. ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి ఇదే నిజమైన నివాళి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ మెడలు వంచేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దౌత్యపరంగా అన్ని చర్యలు చేపడుతోంది.

–సతీష్‌సాగర్‌, బీజేపీ కొంపల్లి మున్సిపల్‌ అధ్యక్షుడు.

సైన్యానికి అండగా ఉందాం



ఉగ్రవాదులను అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సైన్యానికి అండగా ఉండాలి. ఉగ్రవాదం మానవాళికి చాలా ప్రమాదం. ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేసేందుకు తమ ప్రాణాలను పనంగా పెట్టి వీరోచితంగా పోరాడిన భారత సైన్యానికి అభినందనలు. భారతీయుడైనందుకు గర్విస్తున్నాను.

– వివేకానంద్‌, బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే

దేశ ప్రజలకు గర్వకారణం



పాకిస్తాన్‌, పాక్‌ ఆక్రమిత కాశ్మీర్‌ (పీఓకే)లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరికి గర్వకారణం. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా ఉండాలి. ఐక్యంగా ఉగ్రవాదాన్ని అంతం చేద్దాం.

– కూన శ్రీశైలంగౌడ్‌, మాజీ ఎమ్మెల్యే

సైన్యానికి సెల్యూట్‌



భారత సైన్యానికి అండగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. పాక్‌ ఆక్రమిత కాశ్మీర్‌ ఉగ్రవాదులపై భారత సైన్యం జరిపిన దాడిపై యావత్‌ దేశం గర్వించదగ్గ విషయం. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌ నగరం నడిబొడ్డున సచివాలయం నుంచి నెక్లెస్‌ రోడ్డు వరకు నిర్వహించే సంఘీభావ ర్యాలీకి పెద్ద ఎత్తున కదలాలి.

– కొలన్‌ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి

ఘనంగా వాసవీ మాత జన్మోత్సవం



కుత్బుల్లాపూర్‌: వాసవీ మాత జన్మోత్సవం పురస్కరించుకుని బుధవారం జీడిమెట్ల డివిజన్‌ గోదావరి హోమ్స్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుచిత్ర వాసవీ క్లబ్‌ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సామూహిక కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.